క్లుప్తంగా

సమ్మె నోటీసులు అందజేత



కందుకూరులో ఎంఈఓకు సమ్మె నోటీస్ అందిస్తున్న నాయకులు, కార్మికులు

కందుకూరు: ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నామని తెలియజేస్తూ సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈఓ నర్సింహకు, ఉపాధిహామీ ఎఫ్ఏలు ఏపీఓ రవీందర్‌రెడ్డికి సోమవారం సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా బాల్‌రాజ్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేలా కార్మికులు కదలిరావాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం అధ్యక్షురాలు ప్రభావతి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు ఆర్.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

27న నాగోలు గ్రామంలో బోనాలు



సమావేశంలో పాల్గొన్న యెగ్గె మల్లేశం

నాగోలు: ఈ నెల 27న బోనాలు పండుగ నిర్వహిస్తున్నట్లు నాగోలు రామాలయ, పోచమ్మ దేవాలయ, మహంకాళి దేవాలయ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం తెలిపారు. సోమవారం నాగోలులో నవచైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో నాగోలు గ్రామస్తులతో కలిసి బోనాల జాతర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం మాట్లాడుతూ.. నాగోలు పరిసర ప్రాంతాల్లో జూలై 24న తేదీన కాటమయ్య బోనాల ఉత్సవాలు, జూలై 27న బోనాలు పండగ తేదీలను ఖరారు చేశామన్నారు.

పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

నాగోలు: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు విజయవంతం చేయాలని ఆ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం న్యూనాగోలు కాలనీలోని ఎస్కే డాంగే భవన్‌లో ఆగస్టు నెలలో మేడ్చల్ జిల్లా జరుగుతున్న రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్, కరప్రతాలను విడుదల చేసి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి పల్లి కృష్ణ మాట్లాడుతూ.. పేదల పక్షాన నిలబడి, అనేక పోరాటాలు చేసిన ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బషీర్, రాములు, రాజేందర్, మల్లేష్‌గౌడ్, సంజీవ్ కుమార్ పాల్గొన్నారు.


తాగునీరు వృథా



వృథాగా పారుతున్న నీరు

ఎల్‌బీనగర్: విలువైన తాగునీరు వృథాగా పారుతున్న పట్టించుకునే నాథులే లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఎస్కేడీ నగర్ డీపీఎస్ స్కూల్ సమీపంలో గత కొన్ని రోజులు మ్యాన్‌హోల్ లీకేజీతో విలువైన తాగునీరు రోడ్డుపై ఏరులై పారుతుంది.నీటి వృథాను అరికట్టాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కాలనీల్లో కుక్కల బెడద



పద్మావతినగర్ కాలనీలో రోడ్లపై సంచరిస్తున్న కుక్కలు

వనస్థలిపురం: కాలనీలలో వీధి కుక్కల బెడదతో బయటకు రాలేని దుస్థితి నెలకొందని వివిధ ప్రాంతాల వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయని వాపోతున్నారు. కుక్కల బెడదపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేకుండా పోతుందని ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆర్టీసీలో 'యాత్ర'

- పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారికి ప్రత్యేక ప్యాకేజీలు
- సద్వినియోగం చేసుకోవాలంటున్న సంస్థ అధికారులు



మహేశ్వరం ఆర్టీసీ డిపో...

మహేశ్వరం: ప్రయాణికులను ఆకర్షించి ఆర్టీసీని లాభాల్లో పెట్టి, ప్రజలకు సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ(ఆర్టీసీ) కృషి చేస్తోంది. ఇప్పటికే సరికొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టిన ఆ సంస్థ మరో అడుగు ముందుకేసింది. దైవ దర్శనాలకు వెళ్లే భక్తులను ఆకట్టుకునేందుకు పలు ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల్లోనూ ఒక రోజు నుంచి ఐదు రోజుల వరకు టూర్ ప్యాకేజీలు అందజేస్తోంది. మహేశ్వరం, కందుకూరు మండలాలు, పరిసర గ్రామాల నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతోంది. మహేశ్వరం డిపో హైదరాబాద్‌కు అతిచేరువలో ఉండటం, ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బస్సులు నడుపుతోంది. మహేశ్వరం డిపో నుంచి తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలు, సందర్శనీయ స్థలాలకు బస్సు సర్వీసులు నడుపుతోంది. 36 మంది యాత్రికులు ఉంటే ఏరోజైనా బస్సును పంపిస్తామని మహేశ్వరం డిపో మేనేజర్ లక్ష్మీసుధ తెలిపారు.

మహేశ్వరం టు అరుణాచలం

- మహేశ్వరం, కందుకూరు నుంచి తమిళనాడు రాష్ట్రం అరుణాచలం. జోగులాంబ దేవాలయం(అలంపూర్), శ్రీవరసిద్ధి వినాయక ఆలయం(కాణిపాకం), గోల్డెన్ టెంపుల్ (వేలూరు), శ్రీఅరుణాచల ఆలయం.
- పైన పేర్కొన్న టూర్ ప్యాకేజీకి డీలక్స్ బస్సుకు ఒక్కొక్కరు రూ.4,000 చెల్లించాలి.
- టీ, టిఫిన్స్, భోజనం, గుడి దర్శనం టికెట్ల ఖర్చులు ప్రయాణికులే భరించాలి.

ఐదు పుణ్యక్షేత్రాలకు ఒక రోజు ప్యాకేజీ

మహేశ్వరం డిపో నుంచి ఒక రోజు టూర్ ప్యాకేజీ కింద ప్రతీ శనివారం, ఆదివారం ఉదయం 5 గంటలకు డిపో నుంచి బస్సు బయలుదేరుతుంది. 36 మంది ఉంటే బస్సు పంపిస్తారు.

- స్వర్ణగిరి దేవాలయం, యాదగిరిగుట్ట దేవాలయం, కొండపోచమ్మ, కొమరవెల్లి, కొండగట్టు(హనుమాన్ ఆలయం)
- వర్గల్, కొమురవెల్లి, వేములవాడ రాజన్న.
- చింతపల్లి సాయిబాబ దేవాలయం, నాగార్జునసాగర్, ఎత్తిపోతల వాటర్‌ఫాల్స్.
- శ్రీరంగాపురం, బిచుపల్లి, అలంపూర్(జోగులాంబ).
- పైన పేర్కొన్న టూర్ ఒక రోజు టూర్ ప్యాకేజీ కింద ఆర్డినరీ బస్సు పెద్దలకు రూ.1,000, పిల్లలకు రూ.700, డీలక్స్ బస్సు పెద్దలకు రూ.1,200, పిల్లలకు రూ.800
- టీ, టిఫిన్స్, భోజనం, గుడి దర్శనం టికెట్ల ఖర్చులు ప్రయాణికులే భరించాలి.

ఆర్టీసీలోనే సురక్షిత ప్రయాణం



ప్రజలకు ఆర్టీసీ సేవలను విస్తరించాలనే ఉద్దేశంతో యాజమాన్యం టూర్ ప్యాకేజీలను తీసుకొచ్చింది. మహేశ్వరం, కందుకూరు మండలాలతో పాటు ఇతర మండలాల నుంచి ప్రజలు తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. వీరికి సురక్షితమైన ప్రయాణ సౌకర్యం అందించాలనేది ఆర్టీసీ సంకల్పం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– లక్ష్మీసుధ, డీఎం, మహేశ్వరం

లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్‌కు సన్మానం



డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న క్లబ్ ముఖ్య నాయకులు

కందుకూరు: ప్రమాణ స్వీకారానికి అమెరికా వెళ్తున్న లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఏ నూతన గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి, దీపారెడ్డి దంపతులను క్లబ్ ముఖ్య నాయకులు సోమవారం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం ఓర్లాండోలో జరగనున్న 107వ లయన్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ కోసం వారు తరలివెళ్లనున్నారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అమెరికాలో మహేంద్రకుమార్‌రెడ్డి సెరిమోనియస్‌గా ప్రమాణస్వీకారం చేసి వచ్చిన తర్వాత జిల్లాను విజయపథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్లు మనోజ్‌పురోహిత్, జూలూరు రఘు, సూరంపల్లి రాధాకృష్ణ, క్యాబినెట్ కార్యదర్శి తాళ్ల అంజయ్య, కోశాధికారి భీంరెడ్డి రాంరెడ్డి, రీజియన్ చైర్ పర్సన్లు జనార్ధన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పరిటాల రాము, భరత్‌రాజ్, సర్దార్ సంతోక్‌సింగ్, సురేంద్రమోహన్, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కందుకూరు: దెబ్బడగూడలో జెండా ఎగురవేస్తున్న నాయకులు

కందుకూరు: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీనియర్ నాయకుడు అందుగుల కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో జెండా ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కోమ్మగళ్ల నర్సింహ, ఆలేటి కృష్ణ, సిల్వేరు మల్లేష్, పొట్టి సురేష్ పాల్గొన్నారు.

దెబ్బడగూడలో..

దెబ్బడగూడలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకుడు మల్లేపల్లి కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఏనుగు శ్రావణి, నాయకులు ఆర్.వెంకటయ్య, ఎం.రాజు, ఎం.బాల్‌రాజు, అంజయ్య, ప్రభాకర్, సాంబయ్య, సామేలు, రాములు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు



కల్వకోల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

మహేశ్వరం: ఎమ్మార్పీఎస్ ఉద్యమం, మందకృష్ణ మాదిగ పోరాటం ద్వారానే మాదిగల్లో చైతన్యం వచ్చిందని మండల ఇన్‌చార్జి బక్కని రవిమాదిగ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కల్వకోల్, దుబ్బచర్ల, పెండ్యాల, సుభాన్‌పూర్, మన్సాన్‌పల్లి, నాగిరెడ్డిపల్లి, గొల్లూరు, మాణిక్యమ్మగూడ, నాగిరెడ్డిపల్లి, తుమ్మలూరు ఘట్టుపల్లి, మహేశ్వరం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమేనన్నారు. అంతకుముందు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. అదేవిధంగా మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎర్ర గణేష్, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఎర్ర కృష్ణమాదిగ, నాయకులు తొంట జంగన్న, కుమార్, ఆనంద్, ఎస్.కుమార్, యాదయ్య, శ్రీరాములు, దర్శన్, బాల్‌రాజు, మాజీ సర్పంచ్‌లు యాదయ్యగౌడ్, స్లీవారెడ్డి పలువురు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు సమస్యలను విన్నవిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: మారుతీనగర్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కమిషనర్ పి.సరస్వతికి కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లోని 28వ డివిజన్ శ్రీమారుతీనగర్ కాలనీ కార్పొరేషన్ భవనానికి ఆనుకొని ఉంటుందన్నారు. చెంతనే ఉన్నా సమస్యలు మాత్రం తీరడం లేదని వాపోయారు. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని గుర్తుచేశారు. వర్షం పడినప్పుడు నీరు రోడ్లపై నిలుస్తూ దోమలకు నిలయంగా మారుతోందని ఆరోపించారు. కాలనీలను శుభ్రం చేసేందుకు శానిటేషన్ సిబ్బంది ఎవరూ రావడం లేదన్నారు. ఫాగింగ్ అసలే లేదన్నారు. అంతర్గత రోడ్లు అలాగే ఉన్నాయన్నారు. సీసీరోడ్లు వేయాలని విన్నవించారు. స్పందించిన కమిషనర్ త్వరలో సమస్యలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎగిరిశెట్టి సైదులు, ప్రవీణ్, చైతన్య, మహేశ్, పవన్, బంటి ఉన్నారు.

షెడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



ఆలయం వద్ద ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, నాయకులు

మీర్‌పేట: మీర్‌పేట బురుజు వద్దగల హనుమాన్ దేవాలయంలో నూతనంగా నిర్మించనున్న షెడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న షెడ్డు అందరికీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మాజీ మేయర్ తీగల విక్రంరెడ్డి, నాయకులు పల్లె పాండుగౌడ్, కీసర గోవర్ధన్‌రెడ్డి, పల్లె జంగయ్యగౌడ్, ఉయ్యాల నవీన్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు అండగా ఉంటాం

మున్సిపల్ కమిషనర్ సరస్వతి



మహిళా శక్తి సంఘాలు తయారు చేస్తున్న యూనిఫామ్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సరస్వతి

బడంగ్‌పేట్: మహిళా శక్తి, పొదుపు సంఘాలకు అండగా ఉండి ఆర్థికంగా ఎదిగేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో బ్యాంక్ రుణాలు ఇప్పించి సహకారం అందిస్తామని కమిషనర్ పి.సరస్వతి అన్నారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం 36వ రోజు మహిళా సమైక్య సభ్యులతో సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా శక్తి పథకం కింద గ్రూపు సభ్యులకు అండగా ఉండి బ్యాంక్ రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. వ్యక్తిగత రుణాలతో పాటు యూనిట్లను కూడా పరిగణలోకి తీసుకొని బలోపేతం చేసేందుకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఇప్పటివరకు రూ.18లక్షల రుణాలు అందజేశామని స్పష్టం చేశారు. అనంతరం ఎంసీఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న స్కూల్ విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. 17 ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 4,050ల యూనిఫామ్స్ మొదటి విడతలో జూన్ 12న ఒక జత అందించామని గ్రూపు సభ్యులు తెలిపారు. రెండో జత యూనిఫామ్స్ కుట్టడం పూర్తి కావొచ్చిందని.. త్వరలో అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఎంసీ జాన్ కృపాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, కే.మమత, నగేశ్, శంకర్, మౌనిక, వార్డు అధికారులు, ఆర్పీలు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ ఏఈ ఎన్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ రామిడిహిల్స్, బీఆర్ఆర్‌కాలనీ, విశాఖనగర్, సీఎంఆర్‌కాలనీ, సీవైఆర్‌కాలనీ, ఎస్ఎస్‌రెడ్డికాలనీ, వైఎస్ఆర్‌నగర్, రాజీవ్ గృహకల్ప, శ్రీమారుతీనగర్, సప్తగిరికాలనీ, చంద్రవిహార్‌కాలనీ, మారుతీనగర్‌లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు. 11కేవీ అల్మాస్‌గూడ ఫీడర్ పరిధిలోని సీవైఆర్‌కమాన్, ఆర్‌బీరెడ్డి కాలనీ, ఎస్‌బీఆర్‌కాలనీ, ఎంజేఆర్‌కాలనీ, అల్మాస్‌గూడ హనుమాన్ దేవాలయం, హరితహోమ్స్, సాయిప్రభుహోమ్స్, వెంకటేశ్వరకాలనీ, వరలక్ష్మీకాలనీ, మహాలక్ష్మీ, సమతానగర్, సీతాహోమ్స్ ఫేజ్–4, బడంగ్‌పేట అంగన్‌వాడీ, బడంగ్‌పేట ఎక్స్‌రోడ్డులలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

అవగాహన లేమితో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వనస్థలిపురం: అవగాహన లేకుండా జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు వర్షాకాలంలో రోడ్లు వేస్తున్నారని, వర్షాలకు పనులో నాణ్యత లోపిస్తుందని బీజేపీ నాయకులు ఆరోపించారు. సోమవారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఎల్‌బీనగర్ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, సీనియర్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నీళ్ల అంజన్‌కుమార్ గౌడ్ మాట్లాడారు. వనస్థలిపురం రైతు బజారు వద్ద రోడ్డు అధ్వానంగా ఉందని, దానిని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు పనుల విషయంలో ప్రాధ్యాతను పాటించడం లేదని, నాయకుల ఒత్తిడి మేరకు వారు సూచించిన ప్రాంతాల్లోనే పనులు చేపడుతున్నారని ఆరోపించారు. వర్షాకాలంలో నాలాలలో పూడిక తీయడం లేదని, అలాగే పలు కాలనీలలో వీధి దీపాలు వెలగడం లేదని బోనాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కాలనీలలో వీధి దీపాలు వెలిగేలా చూడాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ర్యాలీ ప్రారంభిస్తున్న ఏజీఎం సతీష్

మలక్‌పేట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీచైతన్య స్కూల్స్ దిల్‌సుఖ్‌నగర్ జోన్ ఏజీఎం సతీష్ అన్నారు. స్మార్ట్ లీవింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా సోమవారం గ్రీన్ ఇండియా మిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పురవీధుల్లో నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ పౌరుడు భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవితేజ, ప్రిన్సిపాల్ రిజ్వానా, ఏవో భాస్కర్, డీన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు స్థలం కేటాయించాలంటూ ధర్నా



గ్రామస్తుల వినతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపాల్

కందుకూరు: తమ గ్రామంలో శ్మశానవాటిక స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని కోరుతూ మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామస్తులు సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారి వద్దకు వచ్చిన తహసీల్దార్ గోపాల్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో కొద్దిపాటి స్థలంలో ఉన్న శ్మశానవాటిక సరిపోక అవస్థలు పడుతున్నామన్నారు. 30 ఏళ్లుగా ఈ సమస్య ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని గ్రామాల్లో వైకుంఠ ధామాలు నిర్మించినా, ఇక్కడ స్థలం లేక నిర్మించలేదన్నారు. దీంతో ఎవరైనా మృతి చెందితే ఖననం చేయడానికి నానాపాట్లు పడాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వ భూమిని కేటాయించి సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేరంగుల జంగయ్య, గ్రామస్తులు రావిచెట్టు వెంకటయ్య, దేరంగుల విఠల్, డి.శ్రీరాములు, డి.సత్యనారాయణ, డి.నగేశ్, డి.జంగయ్య, ఎం.యాదయ్య, ఎండీ ఖాసీం, కె.రాజు, కె.శేఖర్, డి.దర్శన్, ఆర్.జైపాల్, పి.సత్తయ్య, డి.లక్ష్మయ్య, డి.కిష్టయ్య, మల్లేష్, డి.శ్రీను, డి.యాదగిరి, డి.జంగయ్య, రాఘవేందర్‌గౌడ్, ఎస్.బాబుముదిరాజ్, ఎం.బాల్‌రాజ్, ఎం.సురేష్, వి.రాజేందర్, ఎం.కృష్ణ, డి.శ్రీనివాస్, వి.జంగయ్య, ఆర్.శ్రీనివాస్, ఆర్.అరుణ్, సిద్ధు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



నాదర్‌గుల్ వద్ద చేపడుతున్న రోడ్డు పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

బడంగ్‌పేట్: రోడ్డు విస్తరణలో భాగంగా నాదర్‌గుల్ నుంచి చేపడుతున్న పనులను సోమవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ శ్రేణులు పరిశీలించారు. ఈ నెల 20 తేదీవరకు రోడ్డు పనులు పూర్తి చేసేలా అధికారులను ఆదేశించడంతో డీఈఈ వెంకన్న ఆధ్వర్యంలో పనులు వేగంగా చేపడుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా నీరు సాఫీగా వెళ్లేలా మ్యాపింగ్ నిర్వహించారు. పనులు నాణ్యతగా మన్నికతో ఉండేలా చూడాలని అధికారులను బీఆర్ఎస్ శ్రేణులు కోరారు. కార్యక్రమంలో నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ ఎల్చేల మమతసుదర్శన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మర్రి జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ అంకంగారి మంజుల కుమార్‌గౌడ్, బీఆర్ఎస్ మున్సిపల్ బీసీసెల్ అధ్యక్షుడు కోటగిరి జంగయ్య, 27వ డివిజన్ అధ్యక్షుడు కొండ విజయ్‌కుమార్, మాజీ వార్డుసభ్యులు దండు యాదయ్య, సుధాకర్, శ్రీరాములు, నరేశ్‌చారి, పెంటయ్య తదితరులు ఉన్నారు.

పండుగల్లో ఆధ్యాత్మికత ఉట్టిపడాలి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల



చెక్కులు అందజేస్తున్న అరుణ రవీందర్‌రెడ్డి

మలక్‌పేట: ఆధ్యాత్మిక ఉట్టిపడేలా పండుగలు, వేడుకలు జరుపుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 105 అమ్మవారికి ఆలయాలకు మంజూరైన బోనాల చెక్కులను ఎండోమెంట్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మిమధుసూదన్‌రెడ్డి, కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, ఓల్డ్‌మలక్‌పేట ఎంఐఎం అధ్యక్షుడు షఫీయుద్దీన్, అధికారులు ఉన్నారు.

సౌకర్యాలు కల్పించండి..

సైదాబాద్: ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం సైదాబాద్‌లోని అమ్మవారి దేవాలయాల కమిటీ సభ్యులకు దేవాదాయ శాఖ నుంచి మంజూరైన నిధులను అందజేశారు.

బడుగుల పక్షాన నిరంతర పోరాటం



మహాసభలో మాట్లాడుతున్న నాయకులు

మంచాల: ప్రజా పోరాటాలతోనే మార్పు సాధ్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. సోమవారం మంచాల మండలం చిత్తాపూర్ గ్రామంలో ఆ పార్టీ 10వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల కోసం పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, ప్రజా సమస్యలు ఉన్నన్ని రోజులు ఎర్ర జెండా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ ఏర్పడి నేటికీ వందసంవత్సరాలు గడిచిందని, దేశంలో అనేక ఉద్యమాలు చేసిందని గుర్తుచేశారు. భవిష్యత్‌లోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తుందని చెప్పారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవడానికి మరో పోరాటం చేయక తప్పదన్నారు. పార్టీ మండల కార్యదర్శి బురుగాల గాలయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజ్ రవీంద్ర చారి, కావలి నర్సింహ, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరిగంటి యాదయ్య, జిల్లా నాయకులు నీలమ్మ, నర్ల శ్రీశైలం యాదవ్, రాజు నాయక్ పాల్గొన్నారు.